తాడిపత్రిలో పాములరావుని తెలియని వారుండరు. పాముల రావుకు మంచి పలుకుబడే కాదు బాగా ఆస్తీ వుండేది. ఉండేది అని ఎందుకు అనవలసి వచ్చిందంటే ఆయన వైభవమంతా పదీ పన్నెండేళ్ళ కిందటి మాట!

పాములరావేం పెద్ద కంట్రాక్టరు కాదు. పెద్ద ఉద్యోగస్తు డంతకన్నా కాదు. కేవలం దర్జీ! అతడు గుడ్డలు కుట్టేవాడు. పాములరావు పెద్ద కొడుకు పెద్ద బజారులో తేరు దగ్గర ఒక మూల చిన్న 'బంకు' బాడుక్కు తీసుకుని అందులో కుట్టుమిషన్ పెట్టుకుని గుడ్డలు కుట్టేవాడు. ఆ కాలంలో తుక్కోజీరావు దగ్గర గుడ్డలు కుట్టించుకోవడం అంటే అప్పటి కుర్రకారుకో పెద్ద ఫ్యాషను.

# కొత్త జాము

—జోస్యము విద్యాసాగర్



పాములరావు మాత్రం ఇంటికి దగ్గరగా, 'జిన్న'ల్లో, కచేరికి దగ్గరగా వున్న 'దేవీ విలాస్' ముందు వరండాలో, అయ్యరు అనుమతితో మరో మెషిన్ కొని అంగడి పెట్టుకున్నాడు. పాములరావు కేవలం ఆడవాళ్ళ గుడ్డలు కుట్టేవాడు. పాములరావు భార్య సక్కూబాయమ్మ ఇంటింటికీ పోయి సిగ్గుపడే ఆడవారి వద్ద, బయటకు రాని లక్షలకు అధికారులయిన సదాశివ రావు లాంటి పెద్దవారి ఆడవారి వద్ద.. కుట్టడానికి గుడ్డలు యిప్పించుకుని వచ్చేది.

కూతురు రుక్మాబాయి జాకెట్లకు కాజాలు కుట్టడం వంటి చేతి పనులు చేసేది. ఆ ఇంటిలో అందరూ సంపాదించేవారే! అందరూ దాచిపెట్టేవారే! అందరూ పొదుపరులే! అప్పటిలోనే తాలూకా కచేరికి ఎదురుగ్గా వున్న గాజుల క్రిష్టప్ప వీధిలో కాలువ గట్టు దగ్గర పనికి రాక పడి వున్న ఒక్క సెంటు భూమి విక్రయానికి వస్తే తీసుకుని, రెండు గదుల మట్టి ఇల్లు కట్టించుకున్నాడు. ఇటు ప్రక్కన కాలువ, అటు పక్కన పెన్నానది ఏరు...

ఎవరికైనా దశ తిరిగితే అంతే! దశ తిరిగినప్పుడే మనిషి సుగుణాలు కూడా బయట పడతాయి. పాముల రావు చెప్పిన సమయానికి సరిగ్గా..మూ రారు గానీ, ఆరు మూరుగానీ, తప్పక అందిస్తాడు. అందించడం మటుకే కాదు ఎవరి గుడ్డా తప్పు కుట్టి ఎరుగడు. అందుకే ఆయనకి అంత వ్యాపారం. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నారు. అలా ఇలా దాచి దాచి నెలకింత చొప్పున బంగారం కూడా కొనసాగారు. కష్టానికి తగినంతగా కాక ఎక్కువగానే లాభాలు రావడంతోనూ, చేత బట్టిందల్లా బంగారం కావడంతోనూ పాములరావు దశ ఆర్థికంగా బాగా మారిపోయింది. అంత మార్పు వచ్చినా ఎన్నడూ ఎప్పుడూ తన పూర్వపు పరిస్థితిని మరచిపోలేదు.

ఎల్లకాలమూ ఒకటే విధంగా వుండదు. ప్రతి మనిషికీ జీవితంలో ఉచ్ఛ దశ ఎలా తెలియకుండ వచ్చేస్తుందో అలాగే పతన దశ కూడా చెప్పా పెట్టకుండ వస్తుంది.

పాములరావుకి ఆ విధంగానే జరిగింది.

ఆ దినం పొద్దున్నే తుక్కోజీరావు బియస్పీ సైకిల్‌కి బాగా మెరుగు వచ్చేదాక పాత బనీనుతో తుడిచి, తల్లి సక్కూబాయమ్మ అందించిన సద్దిమూటని వెనకాల క్యారియర్‌కి వుంచి వెళ్ళిపోయేడు. ఆ తరువాత పాములరావూ వెళ్ళిపోయేడు. పది గంటలకు పనంతా ముగించుకుని కూతురు రుక్మాబాయికి తలుపులన్నీ జాగ్రత్తగా వేసి అంగడి దగ్గరకి పొమ్మని చెప్పి, తాను 'వాటర్ వర్క్స్' రోడ్డులో వున్న శేషావతారం గారింటికి కొంచెం తొందరగా వెళ్ళింది. శేషావతారంగారు ఆ ఊరి మునిసిపాలిటీ కౌన్సిలర్. ఆ నెలలో ఆయన బిడ్డది పెళ్ళి. ఆ పెళ్ళికని చాలా ఖరీదయిన గుడ్డలు బెంగుళూరుకి పోయి తెచ్చుకున్నారు. ఆ గుడ్డలని తెచ్చి సక్కూబాయమ్మ ముందర వేసి వారం లోగా అన్నీ కుట్టి ఇవ్వాలని చెప్పారు. సక్కూబాయమ్మ అందరి కొలతలూ తీసుకుంది. లేనివాళ్ళ కోసం 'అల్తీ' జాకెట్టులను తీసుకుంది. మొత్తం గుడ్డల ఖరీదు ఎంత లేదన్నా ఆరు వేలన్నా అవుతుంది. 'జాగ్రత్తమ్మా! సక్కూబాయమ్మా! ఆరు వేల రూపాయలయినాయి!' అన్న శేషావతారం భార్యకి 'మరేం భయం లేదు లేమ్మా!' అని చెప్పి తీసుకు వచ్చింది. విచిత్రంగా ఆ దినం తండ్రికొడుకుల క్కూడా అటువంటి పెద్ద పనే దొరికింది. కనీసమంటే వేయి రూపాయలు రావచ్చు కూలీలు. ఆ సాయంత్రం ఇంటెల్లిపాది 'విఠోబా' దేవాలయానికి పోయి తమ భక్తి ప్రపత్తులను తెలుపుకుని గంట తరువాత వచ్చిన వాళ్ళకు ఇల్లు మొత్తం దోచుకుపోయిన వైనం తెలుసుకుని కుప్పలా కూలబడిపోయేరు! అనుభవము.. విజ్ఞత వున్న పాముల రావు తన పేరు ప్రతిష్ఠలకూ.. తమ వ్యాపారానికీ ఆ దోపిడీ ఒక మచ్చ గారాదని యెంచి మొత్తం బంగారం అంతా అమ్మి అంతే ఖరీదు గల బట్టలని తిరిగి తీసి సమయానికి సరిగ్గా కుట్టించి ఇచ్చారు. మాట నిలుపుకున్నారు. కట్టుబట్టలు నిలుపుకున్నారు. అంతే! సహజంగా సక్కూబాయమ్మ ఆడది గనుక జరిగిన ఘోరాన్ని తలచుకుని ఎంతో బాధపడిపోయింది. వారం పది రోజులు అన్నం మానేసింది. కానీ, పాములరావు మాత్రం "ఎలా వచ్చింది అలా పోయింది, దానికి బాధేమిటి? నేను గట్టి, నా మిషను గట్టి" అంటూ

నిర్లిప్తంగా వుండిపోయేరు.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, సాములరావు దశ తిరిగి పోయిందని - సిరి తరిగిపోయిందని.

''బాగానే వుంది. కానీ...'', అంటూ నసిగింది సక్కూ.

'తుమీకాయ్ సాంగ్తో' అన్నాడు సాములరావు.

సాములరావు వాళ్ళు 'పట్టేకారు' కులస్తులు. చక్కటి తెలుగు వచ్చినా తమ మాతృ భాషను వదల లేదు వాళ్ళు. తెలుగు భాషా ప్రభావంతో పూర్తిగా సంకరం పొందిన మహారాష్ట్రమునే స్వచ్ఛమైన తెలుగు యాసతో మాట్లాడుతారు. సక్కూబాయయినా భర్త సాంగత్యం వల్ల అంతో ఇంతో మహారాష్ట్ర భాషను మాట్లాడుతుందో ఏమోగానీ వాళ్ళ పిల్లలకి అదీ రాదు.

''మనీ ముల్గీ లగ్నం...''

"పెళ్ళికి ఇప్పుడేమి అడ్డు వస్తుంది సక్కూ?"

"ఎందుకయినా మంచిది. ఒక్కసారి వాళ్ళను కలిస్తే..."

''ఏం? ఎందుకూ? వాళ్ళను కలిసి మా ఇల్లు మొత్తం దోచుకుపోయినారూ... మేము అంత ఇవ్వలేమూ... అని...''

తమాషా ఏమిటంటే వాళ్ళిద్దరి సంభాషణ మొదలు పెట్టినపుడు మహారాష్ట్రలో మొదలయినా ఎప్పుడో వాళ్ళకు తెలియకుండానే అది తెలుగులోకి దిగిపోతుంది. ఇంతకీ సంగతేమిటంటే? రుక్మాబాయికి అనంతపురం దగ్గరున్న సామిడిలో ఓ సంబంధం చూసి నిశ్చయం చేసుకు వచ్చేరు. ఇంకా ఇవాళో రేపో వెళ్ళి ఇచ్చిపుచ్చుకోవడాల వంటి మిగతా వివరాలు మాట్లాడుకుందా మనుకుంటుండగానే ఈ ఘోరం జరిగిపోయింది. పూర్వం డబ్బున్న సాములరావు ఇప్పుడు ఏమీ లేనివాడు.

'అసావహ్...!' సర్దబోయింది సక్కూబాయి.

''అయితే 'కాయ్?'

సాములరావు మొండితనం సక్కూబాయికి తెలియని దేం కాదు. ఆయన నిజాయితీపరుడు. ఆయన మాట నిలబెట్టుకునే మనిషి. అంతేకాదు తానెలా వుంటాడో ఇతరులు కూడా తనలాగే వుండాలని కోరుకుంటాడు. కానీ అలా ఎప్పుడూ జరుగదు. అదీ లోక సహజమే... ఇదీ లోక సహజమే! ఒప్పందం ప్రకారం తన కూతురిని సామిడిలో వుంటున్న శంభోజీరావు కొడుకు నారాయణ రావు చేసుకోవాలి. సక్కూబాయి అనేదేమిటంటే... "వాళ్ళు మన పరిస్థితిని తెలుసుకుని వుంటారు. ఇప్పుడు మనకు ఏమీ లేదు. పేదింటి పిల్ల. అయినా వాళ్ళు తమ మాటకు కట్టుబడి వుంటారా?'' అని.

ఆమెకు లోకరీతి బాగా తెలుసు. ఆమె మనుష్యులని మనస్తత్వాలనీ బాగా అధ్యయనం చేసింది. అంతేకాకుండా ఆమె తల్లి. సగటు తల్లి పడే ఆరాటం ఆమెకు వుంది. కూతురి పెళ్ళి ఇప్పుడు ఈ అనుకోని దుష్టం ఘటనవల్ల ఏమయినా కుంటుపడుతుందా అని ఆమెలో అనుమానం! పూర్తి ముహూర్తపు ఘడియలు వచ్చే దాక ఆగి అప్పుడు చుట్టాలు పక్కాల ముందు నగుబాటుపాలు కావడం కన్నా ఇప్పుడే ఏదో తేల్చేసుకు రావటం మంచిది అని ఆమె అభిప్రాయం.

తండ్రి మొండితనం తెలిసిన తుక్కోజీరావు తల్లిపడే ఆరాటాన్ని కూడ తెలుసుకుని వెంటనే సామిడి ప్రయాణమయేడు. ఆ వూరు చేరాలంటే అనంతపురం పోయి అక్కడ నుంచి బస్సుగానీ, రైలుగానీ తీసుకోవాలి. దూరమేం ఎక్కువ లేకపోయినా బస్సులు ఆలస్యంగా అందుతాయి కనుక బాగా సమయం తీసుకుంటుంది సమిడి పోయి రావటానికి. ఈ ప్రయాణపు ఇబ్బంది అన్నీ తెలిసిన సక్కూబాయమ్మ కొడుకు ఆ రాత్రిగ్గానీ రాడని నిశ్చయించుకుని అతని కోసమని ఆశగా అప్పుడు ఎదురు చూడటం లేదు. అంగడికి ఆనుకుని వున్న రోడ్డు పక్కన రంగప్ప షాపు ముందర అనంతపురం నుంచి వచ్చిన బస్సు నిలచినా, నిలచిన బస్సులోంచి నీరసంగా తుక్కోజీరావు దిగినా, అవేవీ గమనించకుండ వెంకటరమణాచార్యుల వారి అమ్మాయి రవికకి హుక్కులు కుడుతూంది నిర్వికారంగా. అట్లా ఆలోచనల్లో వుందేమో కుడుతున్న వాడి సూది మొన తటుక్కున మధ్య వేలికి సొడుచుకుని చివుక్కున రక్తం చిందితే కుడుతున్న రవికెని కిందికి విడిచి వేసి తలనెత్తి రోడ్డు మీది చూస్తూనే వేలిని నోట్లో వుంచుకుని రక్తాన్ని బాధని పీల్చివేసుకుంది కడుపులోకి.

''అమ్మా...!''

"తుక్కా! బేటా! సామిడి నుంచేనా?"

''ఆ. అప్పుడే?''

''లేదు నాన్నా, ఇప్పుడే ఆ సైకిల్ నారాణప్ప ఇంటికి.''

ఏమయింది నాన్నా...ఏమన్నారు నాన్నా...కాయా సందారా కన్నా... అని అడగాలనుంది ఆమెకి. పోయి వచ్చిన కార్యం గురించిన వివరాలు తెలుసుకుందామన్న ఆతృత వుంది ఆమెలో. కానీ ఎక్కడ ఎటువంటి సమాధానం వస్తుందో...ఏం వినవలసి వస్తుందోనన్న భయము ఆమెని ఆవహించి ఆమె గొంతుని నొక్కేసింది. ఆమెని మౌనంగా వుంచేసింది. ఆమె అయితే మౌనంగా వుండకలిగింది కానీ, ఆ కళ్ళో...? ఆ కళ్ళు మౌనంగా వుంటాయా? వుండగలుగుతాయా? అడగనే అడిగాయి.

"రుక్కూ ఇంట్లోనే వుందామ్మా?"

''ఆ, ఏం? ఎందుకూ?" అనుమానం...భయం... ఆరాటం...ఈ మూడు ఆమె గొంతుని కదిలించి వేశాయి.

"వాళ్ళూ...వాళ్ళు..." నసిగాడు కొడుకు. ఇదీ అని పూర్తిగా చెప్పాలా? నసుగుడు చాలదూ? ఆ మొహం లోని ఆ భావం చాలదూ? అర్థమయిపోయింది. ఆమెకి అంతా అర్థమయిపోయింది. ఆమె ఇటువంటి సమాధానం రాగలదని ముందే ఊహించి వుండటంతో మానసికంగా సిద్ధంగా వుండటంతో ఆమెలో అనుకున్నంత బాధ కనిపించలేదు. ఆవేశపు ఉప్పెన లేదు. ఆవేదనపు ప్రవాహం లేదు. ఆరాటపు వరద కనిపించలేదు. కానీ ఆ బడబానలం మాత్రం హృదయాంతర్భాగాన నిలచి ఆమె శరీరాన్ని కుతకుత ఉడికించి వేసింది: మనస్సుని మాడ్చివేసింది.

''మరి..., మరెల్లరా''

''మాళ్లాం ఇంకెవరూ రాకపోతారా? మన రుక్కుకి పెళ్ళే కాకపోతుందా?''

రుక్మాబాయి పెళ్ళి అంత వైభవంగా చేయాలి, ఇంత వైభవంగా చేయాలి అని ఎన్నో కలలు కన్నారు ఆ యింటి సభ్యులందరూ. ఆ కలలన్నీ ఇల్లా కల్లలయి పోయేప్పటికి ఎందుకో ఆమెకి తటుక్కున మనసులో జనార్దన శాస్త్రిగారు మెదిలారు. ఆయన్ని కలవాలనిపించింది. శాస్త్రిగారు కూడ సాములరావుగారున్న వీధిలోనే వుంటారు. ఆయన జోస్యము చెబుతారు. జాతకాలు చూస్తారు. గ్రహ శాంతులు చేస్తారు. జపాలు వంటివి చేయించి మానసిక ప్రశాంతిని ప్రసాదిస్తారని ఆమె వినింది. ఎన్నో ఉదాహరణలు చూచింది కూడ. ఆయనపై ఆమెకు నమ్మకం.

'చూడమ్మా సక్కూ బాయమ్మా! నేను జాతకాలు

## పండగనాటి వెన్నెల రాత్రి

స్నేహితులారా!
అలా దిగాలుపడ్డ ముఖంతో కూర్చున్నారేం?
దీనంగా కదులుతున్న పండగనాటి వెన్నెల
రాత్రిని
మౌనంగా చూస్తున్నారు కదూ!
నగరంతా పండుగ వేశాం. విందు, వేడుకలు
చేశాం
బంధు, మిత్రుల ఆలింగనాలయ్యాయి
తరలిపోతున్న అప్తులను, కదలివస్తున్న
చిక్కటి రాత్రిని చూస్తే
మీ గుండె గింజుకొంటోందా?
అవునింతకూ రాత్రి భోజనాలయ్యాయా?
కాలేదా?
అమృతపు గిన్నెలో మిగిలిన చివరి చుక్కను
రుచి చూడాలనేనా మీ ఆశ?
ఫరవాలేదు. దిగులుపడకండి నేస్తాల్లారా!
పందిళ్ళు వెయ్యండి. వెన్నెల మనతో
సహకరిస్తుంది.
రేపు మీదీ, నాదీ కాదు. నేటి రోజు
మనందరిదీనూ.
ఎంత ఖర్చు చేసినా చిరునవ్వు తరగని
సంపద.
రండి పిల్లా, పెద్దా భేదం లేక, మనసులు
విప్పి
పిల్లల్లా పిట్టల్లా
ఆడుదాం! పాడుదాం.
ఇది పండగనాటి వెన్నెల రాత్రి తాలూకు
వైభోగం.

—ఎస్.ఎమ్.యాసిన్

మాస్తాను. చక్రాలు వేస్తాను. ముందు జరుగబోయే వేవో చెబుతాను. నిజమే అయినా నేనేం దేవుడిని కానుగా. ఎప్పుడో ఎవరో వ్రాసిన శాస్త్ర ప్రకారం లెక్కలు వేసి చెప్పటమే తప్ప నేనేం భవిష్యత్తులోకి తొంగి మాస్తానా? అదీ ఇదీ కాదని మనం చేసుకున్న కర్మఫలం అనుభవించి తీరాలమ్మా! తప్పదు. పైగా ఏదెట్లా జరుగవలసి వుందో అది అట్ల జరిగి తీరాల్సిందే నమ్మా!"

''అది సరేననుకోండి, అయినా?"

"సరే నీ యిష్టం...ఏం చేయమంటావు?"

"ఏం లేదు, ఏయినా గ్రహశాంతి...జపం..."

"చేస్తాను. నీకు మనస్సు శాంతి పొందుతుందంటే అల్లాగే చేస్తాను. కానీ...కానీ, నాకు మాత్రం అంత నమ్మకం లేదమ్మా!"

"మీకు మీ మీద నమ్మకం లేదు. కానీ, మాకు మాత్రం మీ జోస్యము మీద బాగా విశ్వాసం. చక్రం వేసి చూచి చెప్పలేరూ...లేక...లేక...మీరు...మీరు కూడ...''

## గమ్యం ఎక్కడ



ఒకనాటి నిశీథిలో
విశాల సాంధశాలలో
నా మనసులో ఎన్ని భావాలో
భావాలో మరి నేను కంటున్న కలలో
లేక జరుగబోయే నిజాలో
జీవితాన్ని దేనితో ఎలా పోల్చాలో
నేను దేనికోసం వేచివుండాలో

ఎన్నాళ్ళు ఎదురు చూపులో
చేరుకోవలసిన గమ్యం చేరడం నిజమో కలో
ఎండమావుల్లాంటి ఆశల్లో
వేరవేరే నిజాలో కడతేరే ఇజాలో
నిరాశల నిట్టూర్పుల జీవితంలో
విధికీ మనిషికీ మధ్యన జరిగే పోరాటంలో
మనిషి తాపాశించిన ఫలితం కోసం
ఎన్నాళ్ళు, ఇంకెన్నాళ్ళు -
వేచి ఉండాలో...

- ప్రియ

"ఏమిటమ్మా? నీ వేదో అనుమానిస్తున్నట్టున్నావు?"

'ఏం లేదు స్వామీ? మా ఆస్తులు పోయేయని మీరు గూడ మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారా?"

సక్కూబాయమ్మ ఆవేదన చూచి శాస్త్రిగారు కరిగి పోయి అప్పటి కప్పుడు జాతక చక్రం వేసి గ్రహ వీక్షణలు...ఉచ్చలు...నీచలు...మహర్దశలు...అంత ర్దశలు...కేంద్రాలు...కోణాలు మొదలయిన వన్నీ చూశారు. ఎన్నో లెక్కలు కట్టేరు. చేతివేళ్ళు ఎన్నో మార్లు లెక్కపెట్టుకున్నారు. చివరికి తలెత్తి అదోలా చూచారు ఆమెని.

"స్వామీ చెప్పండి."

"చూడమ్మా! పుట్టినప్పుడు జాతకం వేస్తారు. మీకు ఆ జాతకం లేదు. అందుకని నామ నక్షత్ర రీత్యా వేసిన గ్రహచారం ప్రకారం చెబుతున్నాను. నేను లెక్కలు వేసి. లెక్కలు వేయుగా పుస్తకాలలో వేసిన ఫలితాలని ఉన్నది ఉన్నట్లు చెబుతున్నాను. కానీ ఒక్క మాట. ఇప్పుడు నేను చెప్పే ఫలితాలన్నీ రూపాయికి పావలా వంతు మాత్రమే తీసుకోవాలె! నేను మాత్రం ఏం లెక్కల్లో తప్పులు చేసుండనా? ఓ సెకండు తప్పు తీసుకుంటే అనంతంలో ఆ జీవిత కాలమంత తప్పు పోతుంది. కనుక...''

శాస్త్రిగారు నిష్కర్షగా నిర్మోహమాటంగా చెప్పింది విన్నాక మరింత నీరసం ఆవరించింది ఆమెని. ఆమె స్వామిగారి కాళ్ళపై పడి అభివాదం చేసి బయటపడింది. కానీ ఆమె కాళ్ళు మాత్రం ఆమె స్వాధీనంలో లేవు. ఎట్లా ఇల్లు వచ్చి పడిందో ఏమో...ఆమె...!

ఆ తరువాతి ఆరేడు నెలలు ఎంతో పట్టుదలగా సాములరావు కూతురికోసం సంబంధాలు వెతికేరు. కుదిరినట్లే కుదిరి తప్పిపోయేవి కొన్ని. కుదురుతున్నట్టు అనిపించినప్పుడంతా ఆమె మనస్సు భయంతో నిండి పోయేది. ఆమె చెవుల్లో శాస్త్రిగారి మాటలే ప్రతిధ్వనిం చేవి! కుదిరిపోతే...? కుదిరాక పెళ్ళయాక...? శాస్త్రిగారు చెప్పినట్లు జరిగితే...? అన్న ప్రశ్న.

చిట్టచివరకు రుక్మాబాయి పెళ్ళి జరిగిపోయింది. అబ్బాయి బాగా చదువుకున్నవాడే. శంకరరావు అని కారు డ్రైవరు. శాస్త్రిగారు వచ్చి ఆశీర్వదించేరు ఆ దినం దంపతులని.

"నాకేదో భయంగా వుంది స్వామీ?"

''పిచ్చిదానా! భయమెందుకమ్మా! సంతోషం కల గాలికానీ...! ఇంకేమమ్మా మీ రుక్కమ్మకు మంచి సంబంధం...''

''సంబంధం మంచిదే. కానీ..., కానీ...''

"ఏమిటమ్మా? ఏమిటా అనుమానం?''

"అదే ఆ దినం జాతకం చూచి మీరు చెప్పింది."

'ఏదీ...? నేనేం చెప్పాను?'

'ఆనాళ మీరు ఏదో చెప్పారు.'

'అవునా? చెప్పానా? ఏమోనమ్మా! గుర్తులేదు ఆ సమయంలో..., ఒక్కోసారి నేనేం చెబుతానో నాకే తెలియదు. అవన్నీ నమ్మకు, మరచిపో."

యాదృచ్ఛికమో, లేక శాస్త్రిగారి శాస్త్ర వైదుష్యమో తెలియదుకానీ, ఆయన చెప్పినట్లే కారు ప్రమాదంలో శంకర్రావు చనిపోయేరు...' నేనిది ముందూహించి చెప్పినానా?' అంటూ భోరున ఏడ్చారు శాస్త్రిగారు పాపం. తమ జ్యోతిష్యంపైనే తమకు ఏవగింపు కలిగిం చేంత విషాదం అది.

అయినా కాలం ఎవరి కోసం ఆగదు. దాని పరి భ్రమణం అలా సాగుతూనే వుంటుంది. కాకపోతే అది కనుపించని వేగం.

ఆ రోజు తాడిపత్రిలో గాజుల క్రిష్టప్ప వీధిలో ఆ 'వార్త అట్టుడికినట్లు ఉడికి పోయింది. ఎవరి నోటను విన్నా ఆ మాటే! వీధిలో అందరూ ఒకచోట గుమి గూడి వున్నారు. గుమిగూడింది సాములరావు గారింటి ముందర కాదు. వాళ్ళు చర్చించుకుంటున్నది మాత్రం సాములరావుగారి కూతురు మొగుడు పోయేక మళ్ళీ పెళ్ళి చేసుకున్న దన్నదే! వాళ్ళు గుమిగూడింది శాస్త్రి గారింటిముందు. శాస్త్రిగారు ఆ వివాహాన్ని ఎట్లా ఒప్పుకున్నారన్నదే చర్చ. ఆ చర్చ గుసగుసలుగా మొద లయి చెవులు కొరుక్కోటంతో సాగి పెరిగిపోయి కలకలంగా మారి చివరికి పెద్ద అల్లరిగా మారిపోయింది. నలుగ్గురయిదుగురితో మొదలయిన గుంపు ఇప్పుడు ఏభయ్యరవయి మందితో చాల పెద్దదయిపోయింది.

అప్పుడే తమ అనుష్ఠానం ముగించుకుని కళ్ళు తెరచి రుద్రాక్షమాలని మెడలో వేసుకున్నాక వినిపించిన కల కలం ఏమిటని కూతురిని అడిగారు శాస్త్రిగారు. ఆమె చెప్పింది విని సరాసరి బయటకు వచ్చారు శాస్త్రిగారు.

'నమస్కారం!' అందరి నుద్దేశించి అయనన్నారు.

ఒక్కసారిగా కలకలం ఆగిపోయింది. అందరూ వచ్చిన మాట ... వచ్చిన కార్యం మరచిపోయి అపర శంకరునిలా వెలిగిపోతున్న ఆ బ్రాహ్మ మూర్తిని చూచి భక్తి భావం పైకెగసి పోతే ఆపుకోలేని కొందరు అమాంతం సాష్టాంగ ప్రమాణం చేస్తే ఇంకొందరు గుండెల్లోనే మొక్కుకున్నారు.

"ఈ రాకకు కారణమేదో తెలుసుకోవచ్చా?"

మూగిన జనం అతా గంభీర స్వరాన్ని విని వుండి పోయిందే కానీ, నోరు విప్పి మాట్లాడలేదు.

'సాముల రావు కూతురు ... వివాహం...'

ఎవరో గుంపులో తలను కనిపించకుండ వంచి వినిపించి వినిపించనంత నెమ్మదిగా భయం భయంగా అన్నారు.

"అర్థమయి పోయింది. సాములరావు కూతురికి మొదటి భర్త పోయేరు. ఆ పసిది తలచెడి ఆరు నెలలకే పుట్టిల్లు చేరింది. పాపం! ఆ సక్కూ బాయమ్మనా దగ్గరకే వచ్చింది. అడిగింది. ఏం చేయాలని? రెండవ పెళ్ళి చేయొచ్చా అని. నిజం. నేనే చెప్పినాను. రెండో పెళ్ళి చేయొచ్చని. చేయమని. నేనే సమ్మతి తెలియ జేశాను."

''అయితే అది ధర్మమే నంటారా?"

'ధర్మం! అధర్మం!... న్యాయం అన్యాయం!!' అని నవ్వి ... తమ భుజం పైన వేసుకున్న చిరుగుల ఎర్ర శాలువాని పక్కకు తీసిమంచంపై వేసి ... లావుగా, తెల్లగా మెరిసిపోతున్న జందెం పోగులని రెండు బొటన వేళ్ళకు అటూ ఇటూ వేసుకుని సర్దుకుని కళ్ళర మోడ్చి తలని పైకీ కిందికీ ఊచేరు భావయుక్తంగా శాస్త్రి గారు 'ఏది ధర్మం...? ఏది న్యాయం ...?? ముక్కుపచ్చ లారని ఆ పసిదాని జీవితం ..., వైవాహిక జీవితం ... నాల్గు రోజులతో ఆగిపోవడం న్యాయమా?... అది ధర్మమా? ఆమె ప్రాకృతికమైన ప్రలోభాలకు లొంగి పోయి, సాంఘికమైన కట్టుబాట్లకు, అడ్డుగోడలకు, అణగిపోయి, సాంఘికమైన కట్టుబాట్లకు, అడ్డుగోడలకు, అణగిపోయి ఆగిపోయి ... మనసును చంపుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ జీవితాంతం మగ్గిపోవటము న్యాయమా? ఏది న్యాయము!? స్త్రీ పురుషుల కలయిక ఎంత సాధా రణమో..., ఆ కలయికలోని మాధుర్యాన్ని చవిచూచిన ఆ చిరంజీవి, జీవితాంతం ఉప్పొంగి వచ్చే తన అంత రాంతరాలలోని అన్ని కలలని ఇట్లా చన్నీటిని చల్లి చల్లార్చు కోవడం న్యాయమా...? ఏది న్యాయం?! రహస్యంగా

చాటుమాటుగా, తమ శారీరక వాంఛలని తీర్చుకోటం కోసం తప్పుదారులు వెతుకుతూ, చివరకు అతి పటిష్ఠమైన ఈ సాంఘిక వ్యవస్థకే ... చీడపురుగుగా మారటం న్యాయమా? అదే ధర్మమా? చెప్పండి! ఏది న్యాయం? ఏది ధర్మం...? నిజమే... ఇవన్నీ ఆలోచించే నేనే ఈ వివాహానికి సమ్మతి తెలియజేసేను. ఆ పాములరావు కాదు. నేను ఈ సాహసానికి బాధ్యత స్వీకరిస్తున్నాను. దీనికి మీరు ఏ శిక్ష వేయదలచుకున్నా ... సంతోషంగా స్వీకరిస్తున్నాను. స్వీకరించడానికి సిద్ధంగా వున్నాను..." ఆవేశం కాసేపు ... ఆరాటం కాసేపు, ఆవేదన 'కొంచెం తడవు, ఆగ్రహం మరి కొంచెం తడవు, కనిపించి చివరకు పశ్చాత్తాపంతో గొంతు పడక పోతే స్థిరత్వం అలవరచుకుని వంగిన నడుముని యెత్తి ఎదని ముందుకు చాచి నిశ్చయంగా అన్నారు నిర్భయంగా, నిటారుగా నిల్చుకుని శాస్త్రిగారు.

అయిదు ఆరునిమిషాలు ఆ గుంపు మౌనంగానే వుండిపోయింది. ఎవరో కొందరు మాత్రమే గుసగుసలాడుకున్నారు. మరి కొందరు చేతి వేళ్ళని విప్పి సురితిప్పి గాలిలోకి విసిరి వేశారు. తమలో తామే ప్రశ్నించుకుంటూ ... పిడికిళ్ళు బిగించి బొట్టన వేలిని నిటారుగా వుంచి నిటవాలుగా అటూ ఇటూ వూపేరు తర్కించుకుంటూ ...

"చెప్పండి! ఏమిటి మీ అనుమానం?"

"ఏమీ లేదు. ఈ ధర్మం ... ఈ న్యాయం ... ఎదుటి వారికి బోధపరచడానికేనా...? లేక ...

"లేక...? ఏమిటి? మీ భావమేమిటి?"

"ఏముందీ? వెనకటికి ఒక స్వాముల వారన్నట్లు వంకాయలో తినకండన్నది ప్రజకే గానీ నాక్కాదు అని చాటని చేయమన్నాడుట!"

"అంటే... అంటే ... మీ భావం సరిగ్గా ..."

"ఏముందీ? గురువింద గింజలు..."

'అర్థమయి పోయింది' అర్థమయినట్లు మూగిన గుంపు వైపుకు బొమలు ముడివేసి చూచేరాయన.


'ఆ... ఆ అదే ... అదే దానికి సమాధానం...?'

"నే నేది చెప్పినా శాస్త్ర సమ్మతమని మీరు గ్రహిస్తున్నప్పుడు ఆదరిస్తున్నప్పుడు నేను తీసుకున్న ఏ నిర్ణయమయినా అందరకూ వర్తించేదే."

"అయితే..., అయితే, మీ కూతురిని మాత్రం మరో పెళ్ళి చేయకుండ ఇంట్లో వుంచుకున్నారే?"

"మంచి ప్రశ్నే వేసేవు. బాబూ! అంతేకాదు. నీవు యువతరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వాడివి కూడా కావడం నాకు మరీ ఆనందంగా వుంది. అప్పటికీ ఇప్పటికీ నాది ఒకే మాట...! మా చిరంజీవికి వైధవ్యం ప్రాప్తించింది. నేను ఎప్పుడూ ఆ చిన్నారికి తిరిగి వివాహం చేయడానికి సిద్ధమే. కానీ ... కానీ, బాబూ! ఇక్కడో మాట చెప్పాలి. నేనిట్లా అంటున్నందుకు నీవు ఆగ్రహిస్తావేమో? అయినా నా అభిప్రాయాన్ని చెబుతున్నాను. మీ యువతరంలో హృదయ వైశాల్యం కొరవడినట్లు అనిపిస్తుంది. ఇలా చెప్పడానికి నాకు సిగ్గుగా వుంది.

ఆదర్శాలు మీకు వల్లించడానికి మాత్రమే పనికి వస్తున్నాయి. సమాజంలో పెరిగిపోతున్న కలుపు మొక్కల వంటి ఈ దురాచారాలని ఏరి బయటపెట్టే వరకే పనికి వస్తున్నాయి. నేను కాదు. ఇంకొక రెవరో చేయాలి అన్న భావం పెచ్చుపెరిగి పోతున్నది. నాకు




మాత్రం కుమారి కావాలి. నాకు కట్నం కావాలి. నాకు సుశీల కావాలి. నేను కుల సాంకర్యానికి ఒప్పుకోను. ఇదీ మీ భావ సరళి. ఇటువంటి మీరు ముందుకు వస్తారని ఏ విధంగా అనుకొమ్మంటారు. రాకపోతే నేనేం చేయను? ఇందరి ముందు ఇప్పుడు చెబుతున్నాను ... పాముల రావు కూతురే కాదు. నా కూతురు కూడా విధవే! అయినా నేను పెళ్ళి చేస్తాను. అంతటి ఆదర్శ యువ కులు ... ఎవరైనా వుంటే ... ముందుకు వస్తే..."

"వస్తే... ఎవరికైనా ఇస్తారా? ఏ కులమైనా ఏ మత మైనా సరే ... ఇస్తారా?"

"ఇందరి ముందు చెబుతున్నాను. కులం, మతం ఏదీ చూడను. ఎవరికైనా ఇచ్చి పాణిగ్రహణం చేయడానికి సిద్ధమే."

శాస్త్రిగారి ఆహ్వానం అందరి హృదయాల్లో మంద మందంగా మధుర మధురంగా మువ్వలు మోగించి నట్లయింది.

"నేను ... నేను సిద్ధమే. కాని నేను ... నేను అగ్ర కులం వాడిని కాను ..." సభలో గొంతు ఖంగుమంది.

ఎక్కడో దూరంగా ఓ కోడి కొక్కొరోకో అంటూ కూసింది అప్పుడు. మరో కొత్తజాముకు నాందీ పలుకుతూ!

## నేనో 'వయోలిన్' రాగాన్ని



బాధ సముద్రంలో
ఆలోచనల 'అలల'తో
సమస్యల 'జలచరాలతో' సతమతమవుతున్న
నన్ను
తన 'వయోలిన్'తో వలవేసి పట్టి
ఊహా లోకాల్లోకి తీసికెళ్ళింది ఆమె
గులాబీల ఘుమఘుమల్లోంచి
మల్లెల సువాసనల్లోంచి
పన్నీరు పరిమళాల్లోంచి
నియాన్ వెన్నెల కాంతుల్లోంచి
మిత్రుల
కిలకిల నవ్వుల పువ్వుల్లోంచి
నన్ను
హిమాలయాల్లోకి ఈడ్చుకెళ్ళిన
ఓ 'వయోలిన్'!
నువ్వు నన్ను లాక్కెళ్ళావో
లేక
నేనే నీ వెంబడి పరిగెత్తుకొచ్చానో
కానీ
నా శరీరంలోని మాలిన్యాన్నంతా కడిగేసి
నన్ను పవిత్రుణ్ణి చేశావు
నేనో 'వయోలిన్' నైనా బావుండు
నేనో 'వయోలిన్ రాగాన్నైనా' బావుండు
ఈ దేశాన్నో మారు చుట్టి
'కళా హృదయాల్ని' పరామర్శించడానికి...!
(ఓ మిత్రుని పెళ్ళి రిసెప్షన్‌లో 'ద్వారం మంగతాయారు'గారి వయోలిన్ విన్న తర్వాత-) *

— కోడం పవన్